# కథ

# "ఎవరికొచ్చింది? సొతంత్రం!"

మిట్టమధ్యాహ్నం పన్నెండు గంటలు.

ఆనందపురం నాలుగు రోడ్ల కూడలి దగ్గర నిలబడ్డ నాకు కనుచూపు మేరకు ఎడారివంటి బీడు భూములు తప్ప జీవమున్న ప్రకృతి ఎక్కడా కనిపించలేదు. నిర్మానుష్యంగా వున్న ఆ రహదారి మెలికలు తిరుగుతూ పరుగెడుతున్న కాలనాగులా కనిపిస్తూంది. ఎక్కడా పిట్టగానీ, జంతు జాలాల సంచారంగానీ లేదు.

మానసిక వైకల్యం గురించి తెలియజేస్తూ గ్రామాల వారీగా తిరిగే సంఘసేవా సంస్థలో పని చేస్తున్న నేను ఆరోజు ఉదయమే ఆనందపురం వచ్చాను. మూడు రోజులు ఆ వూళ్ళో వుంటూ చుట్టుప్రక్కల గ్రామాల్లో ప్రచారం చెయ్యడం నావంతు. ఆనందపురంలో ఆ సాయంత్రం ప్రచార కార్యక్రమం వుంది కనుక మధ్యాహ్నం కల్వర్ట్ దగ్గర కూర్చుని ఆ ప్రాంతం గురించి ఆలోచిస్తూ పరిసరాల కేసి చూశాను.

'చెట్టూ చేమలేని ఎడారి' అనుకుంటున్న నాకు ఇంచుమించు రెండు ఫర్లాంగుల దూరంలో విశాలంగా వ్యాపించిన ఒక మట్టిచెట్టు కనిపించింది. ఇందాక ఎడారి అనుకున్న ఆ స్థలంలో ఆ చెట్టు వంటరిగా తోడులేని ఆడదానిలా కనిపిస్తూంది. ఆ చెట్టు మినహా అక్కడ పచ్చదనం లేదు. చెట్టు మీద మాత్రం రకరకాల పక్షులు వున్నాయనడానికి నిదర్శనంగా చెట్టుకొమ్మలకు వేలాడుతున్న గూళ్ళు కనిపిస్తున్నాయి.

ఆ చెట్టుకేసి చూస్తున్న నాకు, నా మనసులో ఎందుకో ఒక ప్రశ్న ఉదయించింది. ఈ ఎడారి వంటి ప్రదేశంలో ఆ మట్టిచెట్టు మాత్రం ఎలా వుట్టి పెరిగింది? మిగతా చెట్లు ఎందుకు పెరగలేదు? ఒకవేళ నేల సత్తు సరిపోలేదంటే ఆ మట్టిచెట్టు కూడా పోయుండాలిగా? ఈ వింత ప్రశ్నకు సమాధానం ఎవరు చెప్పగలరా అని చూస్తూ కల్వర్ట్ మీద కూర్చున్నాను.

ఎవరిని అడగడం అనుకుంటున్న నాకు, ఎదురుగా కనిపించిన ఒక పాక వాకిట్లో, వున్న, చిన్న వేపచెట్టు క్రింద కూర్చున్న ముసలాయన కనిపించాడు. శరీరాన్ని దహించివేసే ఎండలో కూడా ఆ తాత పొడవాటి చుట్టను అగ్గి వున్న వేపు నోట్లో పెట్టుకుని గట్టిగా పీల్చి గుప్పుమని పొగ వదుల్తున్నాడు.

'ఔరా! ఇంత ఎండలో కూడా ఈ విధంగా చుట్ట కాలుస్తున్నాడీ వృద్ధుడు–చూడబోతే ఎనభై సంవత్సరాల వయసుంటుంది. ఎంత సాహసం' అనుకుంటూ అతని దగ్గరికి నడిచాను. చిన్నపాక

## ఉపద్రష్ట సాయి

గుమ్మంలో కూర్చున్న ఆ ముసలాయన నావేపు చూసి 'ఇది చూసిన మొహం కాదే' అనేలా భృకుటి ముడిచాడు. చుట్టను నోట్లోంచి బయటకు తీశాడు. ఎర్రగా మండుతున్న చుట్టమొన కనిపించింది.

"ఎవరూ బాబూ"– అడిగాడు ఆ ముసలతను.

నేను నా గురించి వివరాలు చెప్పి తరువాత మెల్లగా ఆ మట్టిచెట్టు గురించి అడిగాను. "ఈ ఎడారిలో ఆ చెట్టు మాత్రం ఎలా నిలదొక్కుకుంది తాతా" అని.

ఒక్కసారి వేడిగాలి రివ్వున వీచి నా శరీరాన్ని సెగలో పడేసి వెళ్ళిపోయింది. తాత మళ్ళీ చుట్టను నోట్లో పెట్టుకుని గట్టిగా లాగి అంతే వేగంతో పొగను బయటికి బట్వాడా చేస్తూ మరోసారి నాకేసి చూసి ఆగాడు. తాతకళ్ళలోకి చూస్తున్న నాకు ఆ కళ్ళలో అంతవరకు కనిపించిన కాంతి క్రమంగా తగ్గుతూ నిర్జీవంగా మారుతున్నట్లనిపించింది. అంతేకాదు. ఆ కళ్ళలో ఒక సన్నని జీర కనిపించింది.'మట్టిచెట్టు గురించి అడిగితే తాత మొహం ఎందుకు పాలిపోయిందో' అనుకున్నాను నేను.

"అది మట్టిచెట్టు కాదు" అన్నాడు తాత.

ఆ జవాబు విని ఒక్కక్షణం ఆశ్చర్యపోయాను. ఎదురుగుండా అంత పెద్ద చెట్టు కనిపిస్తుంటే అది చెట్టుకాదు, అంటాడేమిటో అనుకుంటూ

"మరి" అడిగాను.

తాతకళ్ళలో అంతవరకు కనిపించిన జీర ఆకారం మారి ముత్యాల్లాంటి నీటి బిందువులై కనుకొలకుల్లోంచి చెక్కిలి మీదికి జారాయి.


"శివరావు" అన్నాడు తాత.

"చెట్టు...మనిషి ఎలా అవుతాడు తాతా–కాస్త వివరంగా చెప్పు" అన్నాను, ఇదేదో వింతగా వుందనుకుంటూ.

"అవును బాబూ ఆ చెట్టు...శివరావు" అన్నాడు మరోసారి.

గట్టిగా, చుట్ట పొగలాగి వదుల్తూ "అదొక కథలే" అని ప్రారంభించాడు.

"సరిగ్గా యాభై సంవత్సరాల క్రితం ఈ ఆనందపురంలో ఇంచుమించు మీ లాగానే, ఒక యువకుడు ఎంతో వుత్సాహంగా సైకిలు మీద తిరుగుతూ వుండేవాడు. ఈ కుగ్రామంలో బాటలు లేవు. ఎగుడుదిగుడు ఎర్రమట్టి బాటలు, గుట్టలు, వుట్టలు, పొదలు, తోటలు, దొరువులు వీటి చుట్టూ అతని సైకిలు తిరిగేది. వయసు చిన్నదే. తెల్లతెల్లగా లాల్చీ, పైజామా తొడుక్కుని ఎంతో అందంగా కనిపించేవాడు. పట్నంలో చదువుకుని పల్లెల్లో సేవ చెయ్యడానికి వచ్చాడట బాబూ. ఇంకా తెల్లదొర పాలనలో వున్న మనదేశంలో స్వాతంత్ర్య సమరం తారస్థాయిలో సాగుతున్న వేళ. ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్ది, దాస్య శృంఖలాలను తెంచివేసే ఉద్యమాలకు ఊపిరి పోస్తూ ఆనందపురం ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లో సంచరించేవాడు అతను. ఆ గ్రామాల్లో కాలుపెట్టి



తిరగడం ప్రారంభించినప్పటి నుంచి అక్కడి ప్రజలందరికీ అతను అవ్వుడైపోయాడు. ముఖ్యంగా ఆ గ్రామాలలోని స్త్రీలకు అతను తమ ఇంటి బిడ్డగా మారిపోయాడు.

'మనకు స్వాతంత్రం రావాలి. మనం బానిసలం కాము. మన భూమి మనతల్లి. మన కష్టం వృధాపోదు. తల్లి భారతి తెల్లవారి చేతి ఆటబొమ్మ కాకూడదు' అనే నినాదాలతో బాటు 'వందేమాతరం' అంటూ గ్రామాల్లో తిరుగుతూ ప్రజల్లో చైతన్యజ్యోతులు వెలిగించాడు.

ఈ తతంగం ఒకవైపు జరుగుతున్నా మరోవైపు మరో సంచలనం మొదలైంది."

తాత చెప్పడం ఆపి "కూర్చో! ఎంతసేపట్లా నిలబడి వింటావ్" అనిచెప్పి, చుట్టనుసి రాల్చి, మళ్ళీ ఓ దమ్ము గట్టిగా పీల్చి పొగ వదుల్తూ.

## గురజాడ వీధి

"చిలుకలున్న చోట డేగలున్నట్లు, భారతదేశ ప్రజల్ని తెల్లదొరలెలా బానిసలుగా చేసి ఆడించారో, ఆనందపురం ఆ చుట్టుప్రక్కల గ్రామాల ప్రజల్ని బానిసలుగా చేసి వేధించేవాళ్ళు స్వార్థపరులైన కొందరు పల్లెపెద్దలు. వాళ్ళు చిన్న చిన్న కూలీలను, బీద బిక్కలను పీల్చి పిప్పి చేసేవాళ్ళు.

తెల్లవారి అజమాయిషీ కన్నా మనవాళ్ళ అజమాయిషీ ఏం తక్కువగా వుండేది కాదు. అటువంటి సమయంలో కూలీనాలీ ప్రజల కళ్ళు తెరిపించే మాటలు చెప్పే ఆ యువకుడి కోసం పేదప్రజలు పడి చచ్చేవాళ్ళు. కానీ వాళ్ళకి భయం ఎక్కువ. కుక్క చాకిరీ చేసినా కుత్తుక తడిసేది




కాదు వాళ్ళకి. వాళ్ళ దయనీయమైన పరిస్థితి చూసి 'దేశానికి విముక్తి కలుగుతుందో లేదోగానీ ఈ ప్రజలకు విముక్తి రావాలి' అనుకునేవాడా యువకుడు.

ఓవైపు స్వాతంత్ర్య సమరం–మరోవైపు సొంతింటి సమరం."

తాత మళ్ళీ చెప్పడం ఆపాడు. "ఎండ దంచే స్తుంది. కొంచెం చల్లని నీళ్ళు తాగుతావా బాబూ" అడిగాడు తాత.

"వుంటే" అన్నాను.

"నీటికిక్కడ కష్టం లేదులే" అని "వాగులూ! నీళ్ళు తేమ్మా" అని మెల్లగా కేక వేశాడు.

ఇంతలో పన్నెండు సంవత్సరాల ఒక ఆడపిల్ల "తాతా" అంటూ వచ్చింది.

"ఈ భాబుకి కొంచెం నీళ్ళు తీసుకురామ్మా" అని పురమాయించాడు.

"గట్టాగే" అంటూ ఆ పిల్లలోపలికి వెళ్ళి ఒక చెంబునిండా నీళ్ళు తీసుకువచ్చింది. స్ఫటికంలా స్వచ్ఛంగా వున్న ఆ నీటిని చూస్తున్న వాకేసి చూసి "తాగండి" అంది ఆ పిల్ల నవ్వుతూ.

ఆ నీళ్ళలాగే ఆ నవ్వు కూడా స్వచ్ఛమైన నవ్వు.

"తరాలు మారినా, అతిథి మర్యాదలు తరగని ఈ పల్లెటూళ్ళే లేకపోతే భూదేవి ఏనాడో ఈ ప్రజల బరువును మోయడం మానేసేదేమో" అనుకున్నాడు.

చల్లని నీళ్ళు కుత్తుకను తడపడంతో శరీరంలో కొంత అదనపు శక్తి వచ్చినట్లైంది. నేను తాగి తాతకేసి చూస్తూ "తాతా! నీకు" అనడిగాను.

"నేను కూడా ఓ గుక్కెడు తాగుతాను" అన్నాడు తాత.

అప్పటికే చుట్ట మసైపోయి పడిపోయింది.

తాత రెండు చేతులతో చెంబు పైకెత్తి ధారగా నీటిని గొంతులోకి ఒంపుకుంటూ గుటకలు వేస్తూ తాగి "ఆహా! అమృతం" అని మళ్ళా "ఇదిగో చెంబు" అని వాగులు చేతికి చెంబును ఇచ్చి రెండు నిమిషాలు మౌనంగా కూర్చున్నాడు.

"తర్వాత..." అడిగాను నేను.

"అంతవరకు బాగానే వుంది బాబూ. కానీ ఈ ప్రపంచంలో మంచికీ చెడుకీ మధ్య సమరం నిరంతరం జరుగుతూనే వుంటుంది. స్వార్థం పేరుకుపోయిన మనిషి తన శ్రేయస్సునే కోరుకుంటాడుగానీ సమాజ శ్రేయస్సు గురించి ఆలోచించడు. ఆ యువకుడు నిస్వార్థపరుడు కనుక ఆనందపురం, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు అందరూ ఆనందంగా బ్రతకాలని కోరుకున్నాడు. పేదప్రజల చీకటి బ్రతుకుల్లో వెలుతురు ప్రసరింపజెయ్యాలనుకున్నాడు. పచ్చని ఆ గ్రామప్రజల జీవితాలు కూడా పచ్చపచ్చగా వుండాలనుకున్నాడు. వాళ్ళకు రాత్రివేళల్లో చదువు నేర్పించేవాడు. ఉత్తరాలు రాయడం, పత్రికలు చదవడం కూడా చెప్పించాడు. వాళ్ళని రెండు కాళ్ల జంతువుల స్థాయినుంచి మనుషుల స్థాయికి తెచ్చాడు. ఒక విధంగా చెప్పాలంటే ఆ ప్రజలలో చైతన్యం తెచ్చాడు. విద్యా గంధం పులుముకున్న గ్రామ ప్రజలు అంతవరకు మరీ వెనుకబడిన ఆలోచనలను మాని పురోగమించడానికి పనికి వచ్చే పనులు ప్రారంభించారు బాబూ. ఫలితం...ఆ గ్రామాల్లోని అంతవరకు ఎదురు ప్రశ్నలు ఎదుర్కోని పెద్దలు... ఎదురు ప్రశ్నలకు బదులు చెప్పవలసి వచ్చింది.

'కూలీ గిట్టుబాటు కాదు బాబూ' అన్నమాట మొదటిసారి వాళ్ళు విన్నారు.

'మార్పుగాలి' వస్తోందని తెలుసుకున్న పెద్దలు... పాటి మనుషుల జీవనస్థాయి పెరగడానికి దోహదం చెయ్యడానికి బదులు, ఈ పరిణామాలకు కారణం ఆ యువకుడే కదా అని ఆవేశపడిపోయారు.

ఇన్నాళ్ళు పొలాన్ని దున్నే ఎద్దులతో ఎద్దులుగా తిరిగిన వాళ్ళు ఇవ్వాడు మెదడు గల మనుషుల్లా మాట్లాడడంతో ఆ పెద్దలు కాస్త ఆలోచనలో పడిపోయారు."

తాత మళ్ళీ చెప్పడం ఆపి కొత్తచుట్ట తీసి వెలిగించి గట్టిగా దమ్ములాగి పొగ వదుల్తూ

"భోజనం చేశావా బాబూ"? అని అడిగాడు.

"చేశాను తాత...నువ్వు..." అడిగాను నేను.

"నాది గంజే. ఎనభై రెండు...వయసైపోయిందిగా సులువుగా అరిగే ఆహారం తినాలిగదా" అన్నాడు తాత.

"మరైతే..అసలు సంగతి ఏమిటి తాతా" అడిగాను ఉత్కంఠ భరించలేక. తాత ప్రారంభించాడు.

"కార్తీక పున్నమికి వారం రోజులుండనగా ఒకనాడు ఆ యువకుడితో కామేశ్వరి రామాలయం వేపచెట్టు దగ్గర మాట్లాడుతూ కనిపించిందట గౌరుబాబుకి. గౌరుబాబు కామేశ్వరి తండ్రిలే."

"అయితే" అడిగాను ఆశ్చర్యంగా.

"గౌరుబాబు తన కూతురు అతనితో మాట్లాడడం సహించలేకపోయాడు. ఆ రోజుల్లో పరాయి మగవాడితో ఒక ఆడది మాట్లాడడం సహజం కాదు. అందునా పేరుమోసిన పెద్దమనిషి గౌరుబాబు కూతురు ఒక సాధారణమైన వ్యక్తితో మాట్లాడడం పెద్ద నేరంగా భావించాడు గౌరుబాబు. ఆ దృశ్యాన్ని చూసి ఆవేశంతో వూగిపోయాడు. కూతుర్ని మందలించాడు. దాంతోబాటు ఆ యువకుడిని బెదిరించాడు.

కానీ కల్మషమెరుగని ఆ రెండు యువ హృదయాలు ఈ మందలింపులను పట్టించుకోలేదు. కామేశ్వరికి ఆ యువకుని మీద వల్లమాలిన అభిమానం. అతనికోసం పరికిణీలో వేరుశెనగ వుండలు, గారెలు వగైరాలు తెచ్చి రామాలయం చెట్టుకింద అతనికచ్చి తొందర తొందరగా వెళ్ళిపోయేది. అప్పుడప్పుడు నేను వాళ్ళను చూసి నవ్వుకునేవాడిని. అతని మంచితనానికి కామేశ్వరి తనను తాను అర్పించుకుంది. నిస్వార్థపరుడైన అతనిని అమితంగా గౌరవించింది.

వారి స్నేహం రహస్యంగా సాగేది. కానీ వాళ్ళు రహస్యం అనుకున్న రహస్యం గౌరుబాబుకు రహస్యం కాకపోయింది."

తాత చెప్పడం ఆపి "మజ్జిగ తాగుతావా బాబూ ఎండ ఎక్కువగా వుంది" అని అడిగాడు.

ఉత్కంఠతో సాగుతున్న కథను ఆపడం ఇష్టం లేక "వద్దు...తర్వాత తాగుతాను. ఆ తర్వాత ఏమైంది..." అడిగాన్నేను.

"అటు చూడు బాబూ! అటు చూడు" అన్నాడు తాత, ఆ చెట్టుకేసి చూపిస్తూ.

నేను చటుక్కున అటుకేసి చూశాను. అక్కడ ఒక ముసలావిడ ఆ చెట్టు దగ్గరకు వెళ్తూ కనిపించింది. మెల్లగా చెట్టును సమీపించి లావైన చెట్టుకాండం మీద తలవాల్చి అలాగే వుండిపోయింది. ఆ దృశ్యాన్ని చూసిన నాకు ఆశ్చర్యం వేసింది., ఆమె ఆ విధంగా ఎందుకు చేస్తోందో అర్థంకాక.


"ఎవరు తాతా...ఆ ముసలావిడ..." అని అడిగాను.

"ఆ ముసలామె...కామేశ్వరి బాబూ..." తాత గద్గద స్వరంతో చెప్పాడు.

"అయితే... అక్కడికెందుకు వెళ్లిందామె? అలా చెట్టు మీద వాలిపోయిందెందుకు..." అడిగాను మళ్ళీ.

"ఇందాకే చెప్పాను కదా...ఆ చెట్టు శివరావు అని.

ఆ వూళ్ళో తిరిగే ఆ యువకుడే శివరావు. ప్రజలను దగ్గరికి చేర్చిన వ్యక్తి శివరావు. కామేశ్వరి



ప్రాణానికి ప్రాణంగా అభిమానించిన వ్యక్తి శివరావు. ఇవుడు కామేశ్వరి వాలిపోయిన ఆ చెట్టు శివరావు."

"అసలింతకీ ఏమైంది తాతా" అడిగాన్నేను ఉత్కంఠ భరించలేక.

"ఒకవైవు స్వాతంత్ర సమరం ఒక దారికి వచ్చింది బాబూ. తెల్లదొర పెత్తనంపోయి మన దేశానికి స్వతంత్రం వచ్చింది. పట్నాల్లోనూ పల్లెల్లోనూ పండుగలు జరుపుకున్నారు. ఈ దేశంలోని అణువణువు మన సొంతం...మనకు మనమే రాజులం అని సంతోషంతో పొంగిపోయారు ప్రజలు...

ఇన్నేళ్ళు తెల్లవాళ్ళ పాలనలో మ్రగ్గిపోయిన మనకు భవిష్యత్తు బంగారుబాటగా కనిపించింది. కానీ అది కేవలం తాత్కాలిక ఆనందమేనని నల్లదొరలు గుర్తుచేశారు.

నాయకులు మారారేగానీ ప్రజల బ్రతుకులు మారలేదనే విషయం స్వతంత్రం వచ్చిన కొద్ది కాలంలోనే తెలిసింది.

బలవంతులు, బలహీనులు అనే తేడాలు, కుల మతాల పేరిట వైషమ్యాలు, మోసం, పగ, ప్రతీకారం, లంచగొండితనం మెల్లగా పెరిగి పెరిగి కొండంతగా మారాయి.

పాపం! శివరావు అనే ఆ యువకుడు మన దేశాన్ని, మన గ్రామాల ప్రజలను ఉద్ధరించాలని, మన ప్రజలను చైతన్యవంతులుగా చేసి పల్లెప్రజల జీవితాలలో వెలుగు దీపాలు వెలిగించాలనుకున్నాడు, కానీ అంతవరకు తెల్లవారి పాలనను విమర్శిస్తూ తిరిగిన శివరావు స్వతంత్రం వచ్చిన తర్వాత జరిగిన సంఘటనలను, జరుగుతున్న వ్యవస్థను చూసి బాధపడేవాడు. కామేశ్వరి అతనికి, అతని ఆశయాలకు అండగా నిలిచేది.

గౌరుబాబు ఈ మార్పును గమనించి మరికొన్నిసార్లు మందలించాడు వాళ్ళిద్దరినీ. కానీ ఈ ప్రకృతిలో విడదీయలేని బంధం ఒకటుంది బాబూ. అది కలసిన మనసుల అనురాగ బంధం. గౌరుబాబు వాళ్ళ బంధాన్ని త్రెంచివేయలేకపోయాడు.

ఒక అమవాస్య మర్నాడు సూర్యుడి తొలి కిరణాలు, రక్తపు మడుగులో పడున్న శివరావు శరీరాన్ని స్పృశించాయి. పాపం, తల వేరుగా మొండెం వేరుగా పడివున్న శివరావు ఆనందపురానికి తన ప్రాణాలను అర్పించేశాడు. అమావాస్య రాత్రి ఆనందపురంలో జరిగిన మారణకాండకు శివరావు బలైపోయాడు. ఎవరు చంపారో ఎవరికీ తెలియదు. మర్నాడు ఆనందపురం దుఃఖ సముద్రంలో మునిగిపోయింది.

గౌరుబాబు జరిగిన అన్యాయానికి తన బాధను తెలియజేస్తూ శివరావుకు ఘనమైన శవసంస్కారాలు జరిపించాడు. శివరావు తాలూకు వాళ్ళకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపాడు. ఆనందపురం ఒక గొప్ప సంఘ సేవకుడిని కోల్పోయిందని ఉపన్యాసమిచ్చాడు.

కానీ కామేశ్వరి మాత్రం తండ్రిని నమ్మలేదు. ఈ హత్యకు కారకుడు తండ్రే అనుకుంది. అయినా పెద్దపులి వంటి తన తండ్రిముందు, తానొక జింకపిల్లే అయింది. కన్నీరు మున్నీరుగా విలపించడం తప్ప మరేమీ చేయలేక నిస్సహాయురాలై మిగిలింది.

శివరావు మరణించిన ఐదవరోజు కామేశ్వరి ఒక చిన్న మల్లిమొక్కను శివరావు శవం పడున్న చోట పాతిపెట్టింది. శివరావు జ్ఞాపకార్థం ఆ చెట్టును అక్కడ నాటిన కామేశ్వరి రోజూ అక్కడికి వచ్చేది. తన కన్నీళ్ళతో ఆ మొక్కకు నీళ్లు పోసేది" తాత మళ్ళీ చెప్పడం ఆపాడు.

దూరంగా మల్లి చెట్టు దగ్గర ఆమె కనిపించలేదు.

"ఆవిడేది తాతా?" అడిగాను నేను చెట్టుకేసి చూస్తూ. "వెళ్ళిపోయుంటుందిలే. ఆమె అప్పుడప్పుడూ అక్కడకి వస్తూ.. వెళ్తూ వుంటుంది" అన్నాడు తాత.

మళ్ళీ తాతే చెప్పడం ప్రారంభించాడు.

"ఆవిధంగా, కామేశ్వరి పెట్టిన మల్లి చెట్టులోకి శివరావు ఆత్మ వెళ్ళిపోయిందంటారు బాబూ! సాధారణంగా మనిషి చచ్చిపోతే ఆత్మ అక్కడే కొంతకాలం తిరిగి, మళ్ళీ మరొక శరీరంలోకి ప్రవేశించి, కొత్త అవతారం ఎత్తుతుందంటారు కదా. కానీ శివరావు మాత్రం... ఆ విధంగా కాకుండా, ఈ మనుషుల మీద నమ్మకం లేక, మనుషుల్లో



ART-7778 TEL

పెరిగిపోతున్న పశుత్వానికి భయపడి మళ్ళీ తను మనిషి రూపం ఎత్తడానికి ఇష్టపడక, అప్యాయంగా, తనమీద అభిమానంతో కామేశ్వరి పెట్టిన ఆ చిన్ని మఱ్ఱి మొక్కలోకి తన ఆత్మను ప్రవేశింపజేశాడు అనుకునేవాళ్లు అందరూ  దానికొకటే కారణం.. అక్కడ ఆ మఱ్ఱిచెట్టు తప్ప మరే చెట్టూ రాలేదు. ఆ మఱ్ఱి  మాత్రం, ఈ నాలుగు దశాబ్దాలలో విశాలంగా పెరిగి అక్కడికి వచ్చే పాదచారులకు దేహతాపం తీర్చే నీడనిస్తుంది. ఎందరో ఆ చెట్టు నీడలో సేదదీర్చుకునేవాళ్ళు. అంతేకాదు. ఆ మఱ్ఱి చెట్టు కొమ్మలనిండా అందమైన పక్షులు కాపురముంటాయి. అవి కిలకిలారావాలు చేస్తూ ఎగురుతూ అందంగా తిరుగుతుంటాయి. శివరావు ప్రజలకోసం తన జీవితాన్నే త్యాగం చేసిన అమరజీవి. అందుకే ఆ జీవి ఆత్మ ఆ చెట్టులో ప్రవేశించి 'ఇన్నాళ్లూ మనిషిగా మీకు సేవ చేశాను. ఇవుడు మానుగా సేవచేస్తాను' అనేలా ఆ చెట్టును బ్రతికించింది.

ఆనందపురంలో అందరూ ఆ చెట్టును శివరావు చెట్టు అంటారు.

పాపం! కామేశ్వరి మాత్రం పెళ్ళి చేసుకోలేదు. శివరావు చనిపోయిన తర్వాత మతిస్తిమితం పోయి పిచ్చిగా ప్రవర్తించేది. చాలా యేళ్లు గదిలోనే బంధించిపెట్టాడు గౌరుబాబు. కాలగమనంలో గౌరుబాబు, అతని పెద్దకొడుకు, కోడలు మరణించారు. మిగిలిందల్లా కామేశ్వరి, ఆమె తమ్ముడు చంద్రయ్య. అతని భార్య, ఇద్దరు పిల్లలు.

మతిస్తిమితం తప్పిన కామేశ్వరి ముసలితనంతో కృంగిపోయింది. బక్కచిక్కి అస్థిపంజరంలా మారింది. ఆనందపురంలో అక్కడక్కడా తిరుగుతూ వుంటుంది. ఇష్టం వుంటే చంద్రయ్య ఇంటి వసారాలో వుంటుంది. లేకపోతే రామాలయం దగ్గరో, ఆ మఱ్ఱిచెట్టు దగ్గరో వుంటుంది" చివరి వాక్యాలు చెబుతున్నప్పుడు తాత గొంతు బొంగురుపోయింది. కళ్ళమ్మట నీళ్లు తిరిగాయి.

"ఎందుకు తాతా.. ఏడుస్తున్నావు" తాత కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అడిగాను.

"పచ్చగా బంగారు బొమ్మలా వుండేది బాబూ కామేశ్వరమ్మ! ఆ తల్లినిట్లా చూస్తుంటే ఏడుపు కాక మరేమొస్తుంది బాబూ. ఆ శివరావు, కామేశ్వరిల బ్రతుకులు నాశనమవడానికి గౌరుబాబే కారణమని అందరికీ తెలిసినా ఒక్కరు కూడా ముందుకు రాలేకపోయారు. బలవంతుడి ముందు బలహీనులు భయపడే మనస్తత్వం నాడు.. నేడూ.. ఏనాడూ వుంటుంది. తిరుగుబాటులో కూడా స్వార్థం చోటు చేసుకుంటే, ఆ తిరగబడేవాళ్లు కూడా మనకెందుకులే అనుకుని వూరుకుంటారు. ఏ కొందరో నావంటివాళ్ళు ఆవేశంగా ముందుకు దూకినా ప్రయోజనం వుండేది కాదు. శివరావు విషయంలో నేను కొంత న్యాయం కోసం పోరాడినా.. జనం భయపడి ముందుకు రాకపోవడంతో నేను కూడా తగ్గవలసి వచ్చింది. పైగా అప్పటికే నా భార్య పోయింది. నేనూ పోతే పిల్లలు అనాథలైపోతారనే భావం నాలో చోటు చేసుకుంది. సాక్ష్యాధారాలు కూడా సరిగ్గా లేకపోవడంతో గౌరుబాబు గౌరవంగానే తిరగ్గలిగాడు. కేసు... లేవలేదు" అని గుక్కదీసుకుని క్షణంసేవు ఆగి

"బాబూ! మనకు స్వతంత్రం వచ్చాక మనం బాగుపడ్డామా బాబూ" తాత ఒక బలమైన ప్రశ్నను నామీదికి విసిరాడు.

నేను మౌనంగా నిల్చున్నాను.

"చెప్పు బాబూ! నువు యువకుడుగా... చెప్పు" అన్నాడు తాత నా మొహంలోకి దీనంగా చూస్తూ.

తాత తెల్లదొరల పాలన, మన నాయకుల పాలన రెంటినీ చూసిన అనుభవజ్ఞుడు. నేను.. సొతంత్రం వచ్చింతర్వాత పుట్టినవాడిని. మన వాళ్ళ పాలననే చూస్తున్నాను. తాత చూసినది తొలి దశలో స్వాతంత్ర సమరం.. తరువాత స్వతంత్ర భారతం. నేను చూస్తున్నది స్వాతంత్ర సమరం కాదు. స్వతంత్రాన్ని నిలువుకునే సమరం. స్వప్రయోజనాల కోసం.. ఎంతకైనా దిగజారే మనుషులేనా స్వాతంత్ర సమరం కోసం పోరాడి అసువులు బాసిన లక్షలాది ప్రజల వారసులు... అనుకునేవాడివి. కనుక తాత సూటిగా నన్ను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాను.

"ఏం బాబూ- మౌనంగా వున్నావు" మళ్ళీ అడిగాడు తాత.

"నాకు తెలీదు తాతా!" అన్నాను.

"నీకే కాదు బాబూ! ఎవరికీ తెలీదు. ఈ దేశంలో ఎవరిని ఈ ప్రశ్న అడిగినా నువు చెప్పిన జవాబే చెప్తారు. పోనీ.. ఇవుడు కాకపోతే మరోసారి ఎప్పుడైనా ఆనందపురం వస్తే అప్పుడు చెప్పు" అన్నాడు తాత, నాకు మరో అవకాశమిస్తూ.

తాత చెప్పిన ఆ మఱ్ఱి చెట్టు కథ విన్న నా గుండె బరువెక్కింది. అవుడే సూర్యుడు పడమటి దిక్కున సంచరించడం మొదలుపెట్టాడు. నేను తాత ధగ్గర సెలవు తీసుకుని బయలు దేరాను. ఆ సాయంత్రం మానసిక వైకల్యం తాలూకు ప్రచారం ముగించి రాత్రి గదిలో పడుకున్నప్పుడు నా కళ్ళకు ఆ మఱ్ఱి చెట్టు కనిపిస్తూంది. చెట్టుతో అతుక్కుపోయిన కామేశ్వరమ్మ కూడా కనిపించింది.

ఆ ఆలోచనలతో మరో రెండు రోజులు గడిచాయి. మూడోరోజు సాయంత్రం ఆ వూరు విడిచివెళ్ళాలి నేను. శ్రీకాకుళంలో మళ్ళీ మా ప్రచారం. ఆనందపురం విడిచి వెళ్లేలోగా ఆ మఱ్ఱి చెట్టును చూడాలనుకుని ఆ చెట్టు దగ్గరికి వెళ్ళడానికి బయలుదేరాను. కొంతదూరం వెళ్ళాక నా కాళ్ళు ఠక్కున ఆగాయి. అయినా తమాయించుకుని అక్కడికి చేరాయి. చెట్టుకు కొంచెందూరంలో నిలబడిన నాకు ఆ చెట్టు దగ్గర కొందరు మనుషులు గొడ్డళ్ళు, బంపాలు పెట్టుకుని ఏవో మాట్లాడుకోవడం కనిపించింది. అక్కడ కామేశ్వరమ్మ పెద్దగా ఏడుస్తూ జుత్తు విరబోసుకుని ఆవేశంగా



**'చీచీ'**

షోమాన్ సుభాష్ ఘై ఒకప్పుడు గోవిందాను 'ఛీ ఛీ' అతనేం యాక్టర్ అన్నాడు. ఇప్పుడు తన కొత్త చిత్రం 'శిఖర్'లో షారూఖ్ ఖాన్ నటించకపోవడంతో ఒకప్పుడు తను 'ఛీ ఛీ' అన్న చీచీతోనే (గోవిందా ముద్దు పేరు) ఆ సినిమా తీస్తున్నాడు.

ooo

**పాత ప్రేమాయణం**

ప్రేమ జంట అమితాబ్ బచ్చన్, రేఖల రొమాన్సు ఇప్పుడు మళ్ళీ మొదలైందట, అమితాబ్ కూతురుకు పెళ్లై పోవడంతో వ్యవహారం ఇద్దరూ బట్టబయలు చేశారు. ఈ దెబ్బతో జయాబచ్చన్‌తో అమితాబ్ పూర్తిగా విడిపోయినట్లే అని అందరూ అనుకుంటున్నారు.



తిరుస్తూ ఊగిపోతూంది. ఆమెను తప్పించడానికి చంద్రయ్య ప్రయత్నిస్తున్నాడు. నేనింతవరకు చంద్రయ్యను చూడకపోయినా, కామేశ్వరమ్మను వెట్టుకోగల వ్యక్తి చంద్రయ్య మాత్రమే అనే వూహ నన్ను అతనే చంద్రయ్య అని నమ్మించింది. నాకేమీ అర్థంకాక అక్కడే నిలబడిపోయాను.

ఇంతలో చంద్రయ్య ఆ నిలబడ్డ వ్యక్తులతో 'కానివ్వండి' అనేలా సైగచేయడం, మరుక్షణం గొడ్డళ్ళు గాలిలోకి లేవడం జరిగాయి. గాలిలోకి లేచిన ఆ గొడ్డళ్లు మఱ్ఱిచెట్టు కాండంమీద వేట్లు పెదుతున్నాయి.

నా కళ్ళకూ.. కామేశ్వరమ్మ కళ్లకూ.. ఆ వేట్లు శివరావు మీద పెదుతున్నట్టనిపించింది. నేను శివరావును చూడకపోయినా ఆ భావన నాలో కలిగింది. అక్కడ వున్న కొందరిని అడిగాను "ఆ చెట్టును ఎందుకు నరుకుతున్నారు" అని.

"అది గౌరుబాబు స్థలం. అక్కడ ఏదో ఫ్యాక్టరీ కడతారట. ఆ స్థలంలో వున్న ఆ చెట్టును నరికి కలపగా అమ్మడానికి ఏర్పాట్లు చేసుకున్నారు చంద్రయ్య అతని తాలూకు వాళ్లు" అన్నారు వాళ్లు. మిగతావాళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నారు.

ఆ మారణకాండను చూడలేక నేను గిరుక్కున వెనక్కు తిరగబోయి ఆగాను. కామేశ్వరమ్మ అక్కడే వున్న చెట్టు దగ్గరికి పరిగెట్టి ఆ మారణహోమాన్ని ఆపబోయింది. అంతే... నేను వున్నచోటనుంచే ఒక్క గావుకేక పెట్టాను.

కామేశ్వరమ్మ అక్కడే కుప్పగా కూలిపోయిరది రక్తపు మడుగులో. మఱ్ఱిచెట్టుకు వేటు వేయబోయిన గొడ్డలికి ఆమె బలైపోయింది.

నా కాళ్ళూచేతులు వణకడం ప్రారంభించాయి. శరీరమంతటా విద్యుత్ ప్రవహిస్తున్నట్టనిపించింది. భూమి కదులుతున్నట్టు పరిసరాలు గిర్రున తిరుగుతున్నట్టనిపించింది. గుండె వేగంగా కొట్టుకోవడం ప్రారంభించింది. కళ్లమ్మట నీళ్ళు ధారగా కారుతుంటే అక్కడ నిలబడలేక వెనక్కు తిరిగి బరువుగా, నడవలేక నడవలేక నడవడం ప్రారంభించాను.

గౌరు బాబు.. తన స్వార్థం కోసం శివరావును చంపించి తప్పించుకున్నాడు.

అది మన దేశానికి స్వతంత్రం వచ్చిన మరుసటి సంవత్సరం. ఇంచుమించు నలభైఆరు సంవత్సరాల తరువాత, మళ్ళీ గౌరుబాబు కొడుకు చంద్రయ్య చచ్చి చెట్టయిపోయిన శివరావుతోపాటు తన అక్కను కూడా పొట్టన పెట్టుకున్నాడు. స్వార్థం... ధనదాహం పేరుకున్న మనుషులను కాలం కూడా మార్చలేదని గౌరుబాబూ, చంద్రయ్య నిరూపించారు.

తెల్లవారి పాలనలో జరిగిన ఘోరాలకన్నా, మన వాళ్ళ పాలనలో తక్కువ ఘోరాలు జరుగుతున్నాయా అనిపించింది. పాలకులు మారినా మనుషుల జీవితాలు మాత్రం భయంతో బిక్కుబిక్కుమంటూనే గడుస్తున్నాయి కదా, అనుకున్నాను. కాకపోతే వాళ్ళు తెల్లవాళ్ళు... పరాయివాళ్ళు.. అని వాళ్ళను పారద్రోలడానికి ఉద్యమాలు, విప్లవాలు, సత్యాగ్రహాలు జరిపారు అనాడు. మరి.. వీళ్ళు.. మనవాళ్ళు. వీళ్ళని మార్చడానికి ఏం చెయ్యాలి? ఎవరు చెయ్యాలి? సమాధానం కోసం వెతుకుతూ నడుస్తున్న నాకు ఎదురుగా వస్తున్న తాత కనిపించాడు.

రెండు రోజుల క్రితం తాత అడిగిన ప్రశ్న గుర్తుకువచ్చింది.

నన్ను చూడగానే "ఘోరమైపోయిందట కదా... ఇప్పడు చెప్ప బాబూ.. మనం సొతంత్రం వచ్చి బాగుపడ్డామా బాబూ... ఇప్పడైనా చెప్ప బాబూ" అని బొంగురుపోయిన గొంతుతో దీనంగా అడిగాడు. తాత కళ్ళల్లో నీళ్లు.

నేను మౌనంగా నిలబడ్డాను...

"ఏం బాబూ! మాట్లాడవు. మనం సొతంత్రం వచ్చి... బాగుపడ్డామా" తాత మళ్ళీ అడిగాడు.

"ఇంకా లేదు తాతా" అన్నాను

తాత నా భుజంమీద చేయివేసి... "ఇప్పడైనా చెప్పావు..." అని ముంధుకు నడిచాడు.

నేను విసవిసా నడవడం ప్రారంభించాను. మరో గంట తర్వాత ఆనందపురం విడిచిపెట్టి శ్రీకాకుళం కేసి నడిచాను. మళ్ళీ నెలరోజుల తర్వాత ఆనందపురం వచ్చిన నాకు అక్కడ మఱ్ఱి చెట్టు కనిపించలేదు. కామేశ్వరమ్మ మరి కనిపించదని నాకు తెలుసు.

శివరావు ఆత్మతోబాటే కామేశ్వరమ్మ ఆత్మ కూడా ఆ చెట్టు వున్నచోటే తిరుగుతూ వుంటుందనుకున్నాను. ఈ మనుషులు మనుషులనే కాదు, మానులను కూడా నరికివేస్తారు కనుక ఆ ఆత్మలు వేటిలోనూ ప్రవేశించకుండా అక్కడే తిరుగుతున్నాయేమో అని కూడా అనుకున్నాను.

ఒక్కసారి తాతను పలకరించాలనిపించింది. తాత పాకకేసి నడిచాను. కానీ అక్కడికి చేరాక తెలిసింది. తాత మరణించి ఆనాటికి పదమూడో రోజని. దిగులుగా నావేపు చూసి "కాస్త దాహం పుచ్చుకుంటారా బాబూ" అని అడిగింది నాగులు.

"వద్దమ్మా! వస్తాను" అని నిట్టూరుస్తూ చెప్పి వెనక్కు తిరిగాను.

"సొతంత్రం వచ్చాక మనం బాగుపడ్డామా? బాబూ!" తాత గొంతు వినిపించింది.

వెనక్కు తిరిగి చూశాను.

తాత లేదు. ◆





### కొత్త సైకలు

సంజయ్ దత్‌కు కొంచెం వెర్రి ఈ మధ్య అతి ఖరీదైన బరువైన బైక్‌ను కొన్నాడు దాని పేరు ఫాట్ బోయ్. షూటింగులు మానేసి దాని మీదే బాంద్రా వీధుల్లో ఊరేగుతున్నాడట. ఈ తంతు చూసి అతని గర్ల్ ఫ్రెండ్ రియా పెత్తి నోరు బాదుకుంటోందిట.

ooo

### సిగ్గరి

కరిష్మా కపూర్‌కు వలుగుర్లో యాక్టింగ్ చేయడమంటే సిగ్గట. డాన్స్ చేసేప్పుడు మినహా తన కోసం ఎవరొచ్చినా వాళ్లను మేకప్ రూంలో కూర్చోమంటుందట. రొమాంటిక్ సీన్లు వస్తే మాత్రం పక్కన ఎవరూ వుండకూడదట.

